లతాంగి - ఆది

పాలనేత్రానల -ప్రబల విద్యుల్లతా
కేళీ విహారల - లక్ష్మీనారసింహా

ప్రళయ మారుత ఘోర - భస్త్రికా పూత్కార
లలిత నిశ్వాస డో - లా రచనయా
కులశైల కుంభినీ - కుముద హిత రవిగగన
చలన విధి నిపుణ ని - శ్చల నారసింహా

వివర ఘనవదన దు - ర్విధహసన నిష్ఠ్యూత
లవ దివ్యపరుష - లాలా ఘటనయా
వివిధ జంతువ్రాత - భువన మగ్నౌకరణ
నవనవ ప్రియగుణా - ర్ణవ నారసింహా

దారుణోజ్జ్వల ధగ - ద్ధగిత దంష్ట్రానల వి
కార స్ఫులింగ - సంగక్రీడయా
వైరి దానవ ఘోర - వంశ భస్మీకరణ
కారణ ప్రకట వేం - కట నారసింహా

శ్రీవేంకటేశ్వరునిపై అన్నమాచార్యులు చెప్పినన్ని కీర్తనలు ఏ యితర దైవంమీదా చెప్పలేదు. వాటితర్వాత అత్యధిక సంఖ్యలో చెప్పినవి నరసింహస్వామిపై కీర్తనలే. శ్రీమన్ శఠగోపయతి వద్ద అన్నమయ్య పుచ్చుకొన్న మంత్రరాజం నృసింహమంత్రమే. ఈ సంస్కృత సంకీర్తనలో ప్రతిచరణమూ ఒకే సమాసంలో ఏర్పడటం విశేషం ! సంకీర్తనాచార్యుల సంస్కృత భాషాధికారానికి సంకేతం.

లక్ష్మీనారసింహా ! నుదుటనున్న అగ్నిరూపమై ప్రబలమైన విద్యుల్లతతో కేళి నల్పే లక్ష్మీ నారసింహా !

ప్రళయకాలపు ఝుంఝుమారుతంతో సమానమైన భయంకరమైన పూత్కార మనే లలితమైన ఉచ్ఛ్వాస నిశ్వాసయేల,ఊ రేలసనకవతాలను, భూమి, చంద్ర, రవి గగనాదులను ఉయ్యాలలూపుతూ నిశ్చలంగా ఉన్న లక్ష్మీనారసింహా !

తెరచిన నీ ఘనమైన ముఖం నుండి వెలువడే దుస్సహమైన అట్టహాసంవలన ఉమిసిన - దివ్యమూ, తీవ్రమూ అయిన - లాలాజలలవఘటనచేత, సమస్త చరాచర జగత్తునూ లయింపజేయగల నిత్యనూతనమైన గుణాలకు సముద్రమా ! లక్ష్మీ నారసిం హమా !

దారుణమై అత్యుజ్జ్వలమై ధగద్ధగాయమానంగా మెరుస్తున్న దంతాల నుండి ఉదయిస్తున్న జ్వాలల నుండి వెడలుతున్న నిప్పురవ్వల లీలచే అవలీలగా శత్రువు లైన ఘోర రాక్షసుల వంశాలను భస్మీకరించే కారణ నైపుణ్యంవల్ల తెలియబడుతున్న శ్రీవేంక టగిరి విహారీ ! శ్రీలక్ష్మీనరకేసరీ ! అని సంబోధిస్తూ ఉగ్ర లక్ష్మీనరసింహ మూర్తికి ఈ సం కీర్తన సమర్పించారు అన్నమాచార్యులు.